

నేడు యథావిధిగా జిల్లా స్థాయి స్పందన

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు స్వయంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

వెక్కిరిస్తున్న పునాదులు..!

- నత్తనడకన జగనన్న కాలనీ నిర్మాణాలు
- 33 శాతం కూడా పూర్తి కాని గృహాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. అయితే సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడం, అధికారుల నిర్లక్ష్యం, మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం వంటి కారణాలతో కాకినాడ జిల్లాలో మూడేళ్ల నుంచి నత్త నడకను పోటీగా నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు 33 శాతం కూడా పూర్తి కాలేదు. నిర్మాణాలను ప్రారంభించనిచోట్ల స్థలాలను రద్దు చేస్తామని అధికారుల బెదిరింపులతో కొన్నిచోట్ల అప్పులు చేసి లబ్ధిదారులు హడావిడిగా నిర్మాణాలు చేపట్టారు. అయితే అనేకచోట్ల పునాదులు దశలోనే నిర్మాణాలు నిలిచిపోయాయి.

పట్టాలు ఇచ్చారు..స్థలాలు చూపించలేదు

సొంత స్థలం లేక ఇల్లు నిర్మించుకోలేని పేదల కోసం ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ప్రత్యేక లేఔట్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రూరల్ ప్రాంతానికి చెందిన పేదలకు సెంటున్నర, పట్టణ ప్రాంతాల వారికి సెంటు స్థలం చొప్పున పట్టాలను పంపిణీ చేశారు. నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని చోట్ల ప్రయివేటు స్థలాలను కొనుగోలు చేసి లే అవుట్లను సిద్ధం చేశారు. అయితే భూముల ఎంపికలో క్షేత్రస్థాయిలో చేసిన పొరపాట్ల వలన వాటిల్లో పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇష్టపడడం లేదు. ఈ పథకంలో భాగంగా 2020 డిసెంబర్ నుంచి జిల్లాలో 72,041 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. గత మూడేళ్లుగా కేవలం 23,804 ఇళ్లు మాత్రమే ఇప్పటి వరకు పూర్తి అయినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తుని, రౌతులపూడి, ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, కరప, సామర్లకోట, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో లేఔట్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నిర్మాణాలు చేయడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. పిఠాపురం, కాకినాడ రూరల్, సామర్లకోట, పెద్దాపురం తదితర మండలాల్లో ఇంకా అనేక మందికి ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ నేటికీ స్థలాలు చూపించలేని దాఖలాలు లేవు. అయితే ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలను చూపించకుండానే హడావుడిగా రిజిస్ట్రేషన్లు ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లోనూ 50 శాతం మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఇంటి స్థలాలను చూపించకుండా రిజిస్ట్రేషన్లు ఏమిటని చాలాచోట్ల సచివాలయ ఉద్యోగులను లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తమకు తక్షణమే స్థలాలు చూపించాలంటూ ఇటీవల సామర్లకోట మండలం వికె.రాయపురం గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. నేటికీ వారి సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.



కాకినాడ లబ్ధిదారులకు కొమరగిరిలో ఇచ్చిన లే అవుట్లో పునాదుల దశలోనే ఉన్న ఇళ్ల నిర్మాణాలు

వివిధ దశల్లోనే కొనసాగుతున్న నిర్మాణాలు

జిల్లాలో సుమారు 72 వేల నిర్మాణాలు చేపట్టగా వీటిలో 3,781 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. 23,804 ఇళ్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో 25,863 ఇళ్లకు పునాదులు వరకూ నిర్మించారు. 14,030 ఇళ్లకు పునాదులు పూర్తి అయ్యాయి. 2231 రూఫ్ లెవెల్ (స్లాబు వరకూ) పూర్తి కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.63,170 లక్షలు ఖర్చు చేసింది. కాకినాడ రూరల్‌లో 5,850 ఇళ్లకు కేవలం 1251, కోటనందూరు మండలంలో 445 ఇళ్లకు కేవలం 46 మాత్రమే పూర్తి అయ్యాయి. యు.కొత్తపల్లి మండలంలో 2,400 ఇళ్లకు సుమారు 1000 గృహాలు, గొల్లప్రోలు మండలంలో 2390 ఇళ్లకు 921, సామర్లకోట అర్బన్‌లో సుమారు 3 వేల ఇళ్లకు ఇప్పటి వరకు 1438, రౌతులపూడి మండలంలో 3278 92, పెద్దాపురం అర్బన్‌లో 2441 ఇళ్లకు 871 మాత్రమే పూర్తి అయ్యాయి. ఇలా అన్ని మండలాల్లోనూ ఇళ్ల నిర్మాణాలు పురోగతి కనిపించడం లేదు. చాలా చోట్ల పునాదుల వరకు నిర్మించి నిలిపివేశారు.

సిఎం ప్రారంభించినచోట కానరాని పురోగతి

కాకినాడ నగరంలోని పేదలకు సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న యు.కొత్తపల్లి మండలం కొమరగిరి లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. 2020 డిసెంబర్ 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఇక్కడ కాకినాడ నగరవాసులకు 16,138 పట్టాలు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు కేవలం 1843 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. మూడేళ్ల నుంచి 11 శాతం కూడా నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. మూడు కాంట్రాక్టు సంస్థలకు నిర్మాణ పనులు అప్పగించినా ఇక్కడ పురోగతి కనిపించడం లేదు. ఇలా ఏ మండలంలో ఏ లే అవుట్‌ను చూసినా పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా దర్శనమిస్తున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు.

సత్యప్రభకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభకు వ్యతిరేకంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నిరసనకు దిగారు. ఏలేశ్వరంలోని ప్రధాన రహదారిపై వారు సత్యప్రభకు వ్యతిరేకంగా ప్లేకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ ఎప్పటి నుంచో పార్టీకి బద్ధులమై పనిచేస్తున్నామని, తమకు నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ తగిన ప్రాధాన్యత ఇవ్వకపోగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. వరుపుల రాజా కష్టాల్లో ఉన్న సమయంలో ఆయనకు అండగా నిలబడ్డామని, ఆయన మృతి అనంతరం మమ్మల్ని కాదని ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఏపూరి శ్రీను, సతివాడ రాజేష్, పైల అయ్యప్ప, ముచ్చి అప్పలరాజు, రాయుడు చిన్న, వాగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులు

వన్యప్రాణులను సంరక్షించుకోవడం అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రకృతి సమతుల్యతకు ఎంతగానో దోహదం చేసే వన్యప్రాణులను సంరక్షించు కోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని జిల్లా ఉప అటవీశాఖ అధికారిణి డి.అనూష అన్నారు. మండలంలోని చొల్లంగి గురుకుల పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అడవులు, వన్యప్రాణులు వాటి సంరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్.ప్రసాద్‌రావు, సెక్షన్ ఆఫీసర్లు ఎం.నాగార్జున, గౌతమ్ వరప్రసాద్, బీట్ ఆఫీసర్లు మహేష్, గోపి నాగేంద్ర, సంధ్యారాణి, బయాలజిస్ట్ డి.మహేష్ బాబు, ఉపాధ్యాయులు రమణి, పార్వతి, హేమలత పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ డిఎఫ్ఒ అనూష

సైకిల్ ట్రాక్‌ను పార్కింగ్‌కు కేటాయించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నిరుపయోగంగా ఉన్న సైకిల్ ట్రాక్‌పై వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రూ.3 కోట్లతో నిర్మించిన స్మార్ట్ సైకిల్ ట్రాక్ ఎందుకు పనికిరాకుండా పోతుందన్నారు. వివేకానందపార్కు, జవహర్ వీధి, నూకాలమ్మ గుడి వీధి, ప్రకాశం వీధి, ఎస్ పి కార్యాలయ రహదారు ల్లో ట్రాఫిక్ అధికంగా ఉంటుందని, కావున నిరుపయోగంగా ఉన్న సైకిల్ ట్రాక్ వద్ద వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు నగర ట్రాఫిక్ విభాగం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారుల దృష్టి సారించాలని సూచించారు.

ఆప్త ద్వారా సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - కాకినాడ

అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా విస్తరిస్తామని ఆప్త ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కాపు కళ్యాణ మండపంలో సుమారు 211 మంది విద్యార్థులకు ఆయా తరగతులు బట్టి ఉపకార వేతనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ కళాశాల చైర్మన్ పోతుల విశ్వం పాల్గొని మాట్లాడారు. ప్రతిభ ఉన్న విద్యార్థి పేదరికం అనే అడ్డంకి ద్వారా చదువుకు దూరమవ్వకూడదనే నినాదంతో ఆప్త ఏర్పాటు కావడం ఆనందకరమన్నారు. చదువులో రాణించిన విద్యార్థులు ఉన్నత స్థానానికి వెళ్ళినా తర్వాత తిరిగి ఆప్తకు సహకారం అందించి మరింత మంది విద్యార్థులకు ప్రోత్సాహకారానికి తోడ్పడాలని కోరారు. విద్య సమాజంలో మార్పునకు ముఖ్య కారణమని, దీని ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. ఆప్త ప్రతినిధులు వెంకట్ సాన, శ్రీధర్ ఆకుల, సానా నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఆప్త 2018లో ఏర్పాటు చేసి ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆప్త ద్వారా సేవలను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ సానా, అడ్డాల సత్యనారాయణ, సుంకర సుమ, జిఎస్ మూర్తి, సుంకర ప్రకాష్, పేపకాయల రామకృష్ణ, బలరాం, భాస్కర్, భార్గవ్, రాజా ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న ఆప్త ప్రతినిధులు

మాజీ స్పీకర్ బాలయోగికి ఘన నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని టిడిపి ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నివాళులర్పించారు. స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద ఉన్న బాలయోగి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోనసీమతోపాటు జిల్లాలో పలు ప్రాంతాల అభివృద్ధికి బాలయోగి చేసిన కృషిని నాయకులు గుర్తు చేశారు. వంతెనలు, రోడ్ల నిర్మాణంలో ఆయన చూపిన చొరవ మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, జక్కల ప్రసాద్, మోర్త భైరవమూర్తి, ఉంగరాల వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.



బాలయోగి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి శ్రేణులు

పోలియో రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - యంత్రాంగం

పోలియో రహిత సమాజమే లక్ష్యమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం 1320 సెంటర్లలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. **కాకినాడ** స్థానిక గాంధీనగర్‌లోని ప్రతాప్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, డిఎం అండ్ హెచ్ఒ నరసింహనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కాకినాడ నగరంలో దాదాపు 170 కేంద్రాలలో పోలియో చుక్కలను వేయిస్తున్నామన్నారు. మరో 20 బందాలు రైల్వే స్టేషన్లు, బస్టాండ్ వంటి వంటి జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేస్తున్నాయన్నారు. మరో ఐదు మొబైల్ టీమ్ లు కూడా పనిచేస్తున్నాయని కమిషనర్ చెప్పారు. డిఎంఅండ్‌హెచ్ఒ నరసింహ నాయక్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 1320 కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తున్నామన్నారు. ఈ నెల 4, 5 తేదీలలో ఆశ వర్కర్లు, ఎఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేసి మిగిలిపోయిన వారికి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీ చరణ్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్న కుమార్, డాక్టర్ సురేఖచౌదరి, డాక్టర్ అజీజ్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పటవల ఉప ఆరోగ్య కేంద్రం వద్ద పిహెచ్‌సి ఛైర్మన్, ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. మండలంలో 46 సెంటర్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాయుడు గంగాధర్, హెల్త్ విజిటర్ నెప్రూూ రాణి, హెల్త్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఎఎన్ఎంలు ఇందిర, స్రవంతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానికంగా జరిగిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని లింగంపర్తిలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పర్వత రాజబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలోని ఇర్రిపాకలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే రాజపూడి, కాట్రావులపల్లి గ్రామాల్లో 90 శాతానికిపైగా పోలియో చుక్కల కార్యక్రమం పూర్తియిందని వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ బండారు రాజా, ఆర్య వైశ్య సేవ సంఘం అధ్యక్షులు కొత్త కొండ బాబులు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని, మల్లిశాల గ్రామంలో ఎంపిపి నాగబాబు ప్రారంభించారు. **సామర్లకోట** పట్టణంలో పలు వార్డుల్లో చేపట్టిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప, ఆర్‌డిఒ జె.సీతారామారావు, కమిషనర్ జె.రామారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న తనంలోనే 0-5 లోపు వయసు గల పిల్లలకు క్రమం తప్పకుండా తల్లి దండ్రులు పోలియో చుక్కలను వేయించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ శానిటర్ ఇన్‌స్పెక్టర్ పిచ్చుక శ్రీనివాసరావు, ఎఎస్ఒ పెంకే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొ న్నారు. **పెద్దాపురం** మండలంలోని పలు గ్రామాల్లో పల్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్న రాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, వడ్లమూరు గ్రామంలో కంటే వీర రాఘవరావు, కాండ్ర కోటలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, రాయభూపాల పట్నంలో ఎంపిపి పెంకే సత్యవతి తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో పల్స్ పోలియో 98 శాతం పూర్తయిందని వైద్యాధికారి సురేంద్ర తెలిపారు. పల్స్ పోలియో బూత్‌లను ఎంపిపి చలగళ్ళ దొరబాబు, జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మీ మంగతాయారు, మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.సరిత, స్థానిక వైద్యాధికారి బి సురేంద్రలు సందర్శించారు. అలాగే పలు గ్రామాల్లో చేపట్టిన పల్స్‌పోలియో కార్యక్రమాలను సర్పంచులు ప్రారంభించారు. మండలంలో 3338 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ సురేంద్ర తెలిపారు. **కరప** మండలంలోని కరప, వేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 48 బూతుల్లో 95 శాతం పల్స్ పోలియో కార్యక్రమం పూర్తియిందని వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ సౌజన్య తెలిపారు. కరప పిహెచ్‌సిల పరిధిలో 3992 మంది పిల్లలు, వేలంగి పిహెచ్‌సి పరిధిలో 2796 మంది పిల్లలు ఉన్నారని, వీరిలో 95 శాతం పిల్లలకు పోలియో చుక్కలను వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో మాజీ ఎంఎల్ఎ వరుపుల సుబ్బారావు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



సామర్లకోటలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప



కాకినాడలో పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్



ఏలేశ్వరంలో పోలియో చుక్కలు వేస్తున్న వరుపుల

కార్టూ'నిజం'



నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్లు..

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణంలో పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఎవరికి పట్టనట్టుగా సామర్లకోట పిఠాపురం రోడ్డులో అపార్ట్మెంట్ల సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్నాయి. పట్టణంలో అనేక ప్రాంతాల్లో విద్యుత్‌లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండగా చిన్న పాటి రిపేర్లకు గురైన విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌లు అధికారుల నిర్లక్ష్యానికి గురవు తున్నాయి. స్థానిక పిఠాపురం రోడ్డులోని టిడ్ కో గృహ సముదాయాల వద్ద ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లను ట్రాన్స్‌కో అధికారులు ఉంచారు. లో వోల్టేజి సమస్య రాగానే వాటిని తొలగించి ఇలా ప్రక్కన పడేస్తున్నారు. దానితో లక్షలాది రూపాయలు విలువజేసే పరికరాలు తుప్పు పడుతున్నాయి. కొంతకాలం వాటిని అలానే వదిలిపెడితే దానిలోని కాపర్ చోరీకి గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఏళ్ళ తరబడి లబ్ధిదారులకు టిడ్ కో గృహాలు అప్పగించని కారణంగా గృహాల్లో ఉన్న విద్యుత్ సంబంధిత సామాగ్రి చోరుల పాలు అవుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలో కారణం లేకుండా ఆ ప్రాంతంలో ఉంచిన ట్రాన్స్‌ఫార్మార్లు సైతం కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే కొద్దిపాటి లోపాలున్న ట్రాన్స్‌ఫార్మార్‌లకు రిపర్లు చేపట్టివినియోగంలోకి తీసుకువచ్చి లోవోల్టేజి ఉంటున్న ప్రాంతాల్లో, విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని, తద్వారా ట్రాన్స్‌ఫార్మార్‌లలో కాపర్ చోరీలను ఆపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు



బోరు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీరరాఘవులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పు పాకలు గ్రామ ప్రజలు దాహార్తిని తీర్చేందుకు బోర్‌ను నిర్మిస్తున్నట్లు గ్రామ వైసిపి ఇన్‌ఛార్జ్ పడాల వీరరాఘవులు అన్నారు. రూ.7.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న బోరు, పైపులైన్ పనులను ఆయన ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొనే వారని, దీంతో మండల పరిషత్ నుంచి రూ.7.5 లక్షలు మంజూరు అయ్యాయని, ఈ నిధులతో బోర్‌ను ఏర్పాటు చేసి, పైపులైన ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు ఈ వేసవిలో ప్రజలకు తాగు నీటి సమస్య ఉండదని అన్నారు.

సామర్లకోటలో ఎంఎల్ఎ చినరాజప్ప ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పలువురు పారిశ్రామికవేత్తలు, వైద్యులు, ఆధ్యాత్మికవేత్తలను కలిసి మద్దతు కోరారు. తొలుతగా మటన్ సెం టర్‌లోని వీరభద్ర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక అయోధ్య రాంపురంలోని పారిశ్రామికవేత్తలు పెనుపోతుల సూర్యనారాయణ, సింగవరపు సాయిబాబు, తులసీధర్ రావు సోదరులు, రాయల్ డెంటల్ క్లినిక్ వైద్యులు దిలీప్‌కుమార్, సువర్చలాదేవి, వైసిపి నాయకుడు కోటిపల్లి శ్రీనివాస్, ఆధ్యాత్మికవేత్త జివికె.మోహనరావు తదితర కుటుంబీకులను కలిసి రాబోయే ఎన్నికల్లో తన విజయానికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఐదేళ్ల వైసిపి పాలన వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేసిన అరాచక పాలన వల్ల రాష్ట్రానికి రావాల్సిన పారిశ్రామికవేత్తలు పక్క రాష్ట్రాలకు పారిపోతున్నారని అన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దివాళ తీయిస్తూ ప్రజలకు ఏదో గొప్పలు చేసినట్లు చెప్పుకుంటున్నారని అన్నారు. ఇదే పాలన కొనసాగితే రాష్ట్రం మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి మేలు జరగాలంటే తిరిగి చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, బలుసు వాసు, బి.త్రిమూర్తులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పారిశ్రామికవేత్త సాయిబాబాతో మాట్లాడుతున్న చినరాజప్ప

పకడ్బందీగా 10వ తరగతి పరీక్షలు

డిఇఒ కె.వాసుదేవరావు



ముఖాముఖి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఈ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. పకడ్బందీగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30116 మంది విద్యార్థులు

2024 మార్చి 18 నుంచి నిర్వహించే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి మొత్తం 30116 మంది హాజరుకానున్నారు. వీరిలో బాలురు 15819 మంది, బాలికలు 14297 మంది ఉన్నారు. వీరిలో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థినీ విద్యార్థులు 29,990 మంది కాగా, ఓఎస్ఎస్‌సి ప్రయివేట్ విద్యార్థినీ, విద్యార్థులు 126 మంది ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందించాము. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేశాము. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాము.

137 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో 137 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాము. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగనున్నాయి. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తాము. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదు. పరీక్షా కేంద్రాలను ముందుగానే ఒకసారి తనిఖీ చేసి లోటుపాట్లు ఉంటే ముందుగానే చక్కదిద్దనున్నాము. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు, బిపి, షుగర్ చెక్ చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉంటారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

జిల్లాలో 5 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించాము. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేకమైన నిఘా ఏర్పాట్లు చేపట్టనున్నాము. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయనున్నాము. స్క్వాడ్స్ ప్రతిరోజూ ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తాయి.. అలాగే సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టనున్నాము. పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. దివ్యాంగులకు అవసరమైతే స్క్రయిబ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాము. డిఒలు 237, ఎడిఒలు 6, ఇన్విజిలేటర్స్ 1255, స్క్వాడ్స్ 5, సి- కార్ కస్టోడియన్స్ 19 నియమించాము.

పక్కా ప్రణాళికతో పరీక్షలకు విద్యార్థులు సిద్ధం

10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను ప్రణాళికా బద్ధంగా సిద్ధం చేశాము. తొలుత విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అదేవిధంగా ప్రతి రోజూ పరీక్షల నిర్వహణ ద్వారా విద్యార్థులలో పరీక్షల పట్ల భయం దూరం చేశారు. 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేశాము.

నేరాలు ఘోరాలు

ఎఎన్‌ఎం అదృశ్యంపై కేసు నమోదు



ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాద్రిరావు పేట గ్రామంలో ఎఎన్‌ఎంగా పనిచేస్తున్న మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన సిద్ది రామకృష్ణ కుమార్తె సిద్ది కనకదుర్గ వెంకటలక్ష్మి నీలాద్రిరావు పేట గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. అయితే భర్త గతంలో మృతి చెందగా, కుమారుడు ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన గృహంలో ఉంటూనే ఎఎన్‌ఎంగా నీలాద్రిరావు పేటలో సచివాలయంలో ఎఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తుంది. శనివారం మధ్యాహ్నం 12:45 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 9440904841, 08852294100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ చేసిన పిడిఎస్ బియ్యాన్ని ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామంలో అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారంతో పోలీసులు ఆదివారం మద్దుల వెంకటేశ్వరరావుకు చెందిన బియ్యం షాపును తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 743 కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ శాఖకు అప్పగించారు. ఈ మేరకు నిందితునిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

ఇంటి వద్ద నిద్రిస్తున్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆ మహిళ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ఆలేటి రామకృష్ణ, అతని భార్య ఆలేటి లక్ష్మి శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి గుమ్మం వద్ద నిద్రిస్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కర్రతో లక్ష్మి తలపై బలంగా కొట్టి పారిపోయాడు. ఆమెకు బలమైన గాయం కావడంతో రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఈ మేరకు నమోదు అయిన కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - [illegible]

మండలంలోని చిక్కాల గ్రామ శివారులో శనివారం సాయంత్రం పేకాట ఆడుతున్న శిబిరంపై దాడిచేసినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేశామని, ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బొబ్బిల్లంక, ముగ్గుళ్ళ గ్రామాల లంక ప్రాంతాల్లో ఆరు నాటు సారా స్థావరాలపై స్థానిక ఎస్ఐ టి.రామకృష్ణ సిబ్బందితో కలిసి ఆదివారం మెరుపు దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 8200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే 41వాటర్ డ్రమ్ములను, సారా తయారీకి ఉపయోగించే పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకతో సారా తయారీదారులు అక్కడి నుంచి పరారయ్యారని ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు. ఎవరైనా అక్రమ మద్యం రవాణా చేసినా, అక్రమ మద్యం తయారీ చేసినా, కోడిపందాలు, పేకాట, జూదం, గంజాయి రవాణా వంటివి నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి నేరాలకు సంబంధించిన సమాచారాన్ని 9440904832 నెంబర్‌కు తెలియచేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల

మల్లంపేటలో గడప గడపకూ వైసిపి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని మల్లంపేట గ్రామంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తొలుతగా ఉప్పంపాలెం గ్రామ సర్పంచ్ ఏనుముల కోటిబాబు ఆధ్వర్యంలో జరిగిన వైసిపి శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు వైసిపి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్వత రాజుబాబు, జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, వైసిపి నాయకులు వాసిడి జమీలు, తాతాజీ పాల్గొన్నారు.

రోగులకు ఆహారం పంపిణీ



అల్పహారాన్ని అందిస్తున్న దేవత రాజేష్‌కుమార్

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి సంస్థ ద్వారా పట్టణ పరిధిలో 45 పోలియో వ్యాక్సిన్ శిబిరాలకు, కాండ్రకోట పిపి యూనిట్ పరిధిలో 27 శిబిరాలకు,పెద్దాపురం ప్రాథమిక చికిత్స కేంద్రంలో 100 మంది రోగులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయనిది వ్యవస్థాపకుడు దేవత రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్య సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఆలమూరు

రావులపాడులో ఈ నెల 7న నిర్వహించనున్న మాదిగల రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం గుమ్మిలేరులో చైతన్య సభ కరపత్ర ఆవిష్కరణకు ఆయన హాజరై కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జింగి సుధాకర్ మాదిగ, ఇంచార్జ్ తాతపూడి మూర్తి మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుంగ సునీల్ దత్తు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ ఆప్షన్ తొలగింపుపై టిడిపి నిరసన

ప్రజాశక్తి -మామిడికుదురు

శెట్టిబలిజలకు ప్రభుత్వం జారీచేసే సర్టిఫికెట్ల విషయంలో ఆప్షన్ తొలగించడంతో అన్యాయం జరుగుతుందని మండల టిడిపి అధ్యక్షులు మొలేటి శ్రీనివాస్ ప్రభుత్వ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాశర్లపూడిలో ఆదివారం ప్రభుత్వ తీరు పై పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు దీన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒసి, ఎస్‌సి సామాజిక వర్గాలు పాల్గొని మద్దతు తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-కొత్తపేట

పలివెల గ్రామంలో చప్పిడివారిపాలెం, రజకులపేట, చినపేట, అరుంధతిపేట, ఎస్‌టి ఏరియాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నియోజగవర్గ టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట మండల, పలివెల గ్రామ శివారు గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

మోడేకుర్రు గ్రామ పంచాయతీ శివారు కడలివారిపాలెంలో గ్రామ టిడిపి ఆధ్వర్యంలో వైసిపిని నుంచి భారీగా టిడిపిలో ఆదివారం చేరారు. వీరికి బండారు సత్యానందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారంతా టిడిపి,జనసేన అధికారం వచ్చేలా కషి చేయాలని కోరారు. అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘం కృషి



ఛైర్మన్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఉద్యోగుల విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలో ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని అధ్యక్షుడు మట్టా శ్రీనివాస రావు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కన్వెన్షన్ హాలునందు ఆదివారం సంఘం సహాయ కార్యదర్శి పెట్టా శివ ప్రసాద్ అధ్యక్షతన షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం(ఎస్ 16) సమావేశం జరిగింది. శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమంతో పాటు, వృత్తిపరమైన సవాళ్లను పరిష్కరించడంలో సంఘం ముందుంటుందని హామీనిచ్చారు. అనంతరం అంబేద్కర్ కన్వెన్షన్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి, పూర్తి చేయడానికి సహకరించిన ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. మంజూరైన నిధులను సక్రమంగా సద్వినియోగం చేసి కన్వెన్షన్ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దిన నగర పంచాయతీ ఛైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్‌ను సంఘం సత్కరించింది.ఈ కార్యక్రమ ంలో కె.వెంకటాచారి, జె.బాలకృష్ణ, లక్ష్మణ్ కుమార్, డాని యెల్ అబ్బులు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికకు వేధింపులు. న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-మండపేట

బాలికను వేధించిన ఘటనపై బాలిక బంధువులు నాయ్యంచేయాలని ధర్నాచేశారు. కేశవరం గ్రామంలో 9వ సంవత్సరాల వయస్సు గల బాలిక 4 వ తరగతి చదువుతోంది. ఈ బాలికను మూడురోజుల క్రితం లైంగికంగా వేధించిన ఎంపిపి కారు డ్రయివర్‌గా పనిచేస్తున్న కూసు ప్రసాద్ క్షమాపణ చెప్పాలని బాలిక కుటుంబ సభ్యులు కేశవరంలో రోడ్డుపై ధర్నా చేశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ఏదైనా సమస్య ఉంటే కేసు పెట్టుకోవాలని ట్రాఫిక్ ఆపడం సరికాదని నచ్చచెప్పి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

దీంతో గ్రామ పెద్దలు కలగజేసుకుని, చిన్నారి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల చిన్నారిని బండి ఎక్కమని వేధిస్తూ వెంటపడిన ఇటువంటి దుర్మార్గుడిని ఉపేక్షించకూడదన్నారు. అందుకనే మీడియా ద్వారా సమస్యను అందరి దృష్టికి తీసుకువస్తున్నామని అన్నారు. బాలిక పట్ల వేధింపులకు పాల్పడిన కూసు ప్రసాద్ బహిరంగంగా క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ నెల 9న ప్రత్తిపాడులో నిర్వహించే చంద్రబాబు భారీ బహిరంగ సభను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. మండలంలోని ఇర్రిపాకలో ఆయన మాట్లాడు తూ మానవ ప్రయత్నం చేస్తే ఏదైనా సాధించగలమని నిరూపించిన కార్య క్రమమే ఈ మహా రుద్రాభిషేకమని అన్నారు. ప్రత్తిపాడులో జరిగే కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గం నుంచి సుమారు 20 వేల మంది టిడిపి, జనసేన శ్రేణులు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 9వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సోమవరం గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకోవాలని, అక్కడ నుంచి బయలుదేరి ప్రత్తిపాడు బహిరంగ సభకు వెళ్లాలని అన్నారు. ప్రతి గ్రామానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు వెళ్లి జనసేన కార్యకర్తలను ఆహ్వానిం చాలని ఊచించారు. ఈనెల 12వ తేదీ నుంచి నియోజవర్గ పరిధిలోని 12 కస్టర్లలో 12 సభలు ఏర్పాటు చేస్తామని, ముందుగా 12వ తేదీ నరేంద్ర పట్నంలో సభ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



జెండా ఆవిష్కరణలో యనమల కృష్ణుడు, సోడిశెట్టి గణేష్

ప్రజాశక్తి - కోటనందూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి విజయం సాధించడం తథ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. ఆదివారం మండలం లోని కెఎ మల్లవరం గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని యనమల కృష్ణుడు, తుని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సోడిశెట్టి గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణుడు మాట్లాడుతూ జగన్ పాలనపై రాష్ట్ర ప్రజలు అసహనంతో ఉన్నారని అన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగిపోవడంతో సామాన్యుల పరిస్థితి మరింతగా దిగజారిపోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విచ్ఛిన్నంగా మారిందని, అప్పులు ఊబిలో నెట్టేశారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి సైనికుల్లో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి రాజబాబు, షేక్ నవాజ్ జానీ, జనసేన నాయకులు పెదపాతిని శ్రీనివాస్, లోవరాజు, రాము, నరేష్, లోకేష్, రాజు, పైల లోవరాజు, నాగేంద్ర, రాజశేఖర్, బాలాజీ పాల్గొన్నారు.

వైసిపి ప్రజలకు చేసింది ఏమీ లేదు

ప్రజాశక్తి - జగ్గంపేట

వైసిపి పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేదని జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ మారోతి శివగణేష్ అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపిలో యువజ నులు, శ్రామి కులు, రైతుల పేర్లు తగిలించుకున్నా వారికి చేసింది ఏమీ లేదన్నారు. శుష్క వాగ్దానాలు, శూన్య కష్టాలు అన్నట్టు వైసిపి పాలన ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎపిపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువజన, శ్రామిక, రైతులకు న్యాయం జరుగు తుందని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఆయా వర్గాలకు న్యాయం చేసే హామీలతో సాగుతుందని తెలిపారు. ఎవరు ఎన్ని హామీలు ఇచ్చినా ఇందిరమ్మ అభయం పథకం ముందు బలాదూర్ అని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వత్సవాయి బాబు, నక్కా సత్యనారాయణ, గుర్రాల రత్నాజీ రావు, కొండ శ్రీను చంద్రమౌళి వెంకటరత్నం, నక్కిరెడ్డి విష్ణుచక్రరావు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి దాడిశెట్టి

వైసిపిలో చేరిన పలువురు

ప్రజాశక్తి - కోటనందూరు

మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో తొండంగి మండలం పెరుమళ్లపురం పంచాయతీ కొత్త చోడిపల్లి గ్రామానికి చెందిన పలువురు టిడిపి కార్యాకర్తలు వైసిపిలో చేరారు. వీరికి వైసిపి జెండాలను కప్పి పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు. వైసిపి ప్రభుత్వంపై నమ్మకంతో పలువురు టిడిపిని వీడి వైసిపిలో చేరుతున్నారని మంత్రి అన్నారు.

గుమ్మరేగులలో ఉచిత వైద్య శిబిరం



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న వరుపుల

ప్రజాశక్తి - రౌతులపూడి

గుమ్మరేగులలో ఆదివారం కాకినాడకు చెందిన అంజు కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 50 మంది విచ్చేసి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 21 మందిని కంటి శస్త్ర చికిత్సకు వైద్యులకు గుర్తించారు. ఉచిత రవాణాతో వారిని చికిత్సకు తీసుకెళ్లారు. ఈ వైద్య శిబిరంను సర్పంచ్ రాపర్తి రామకష్ణ ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు శిబిరాన్ని సందర్శించి కంటి వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గొల్లు చినదివాణం, వైద్యురాలు శ్రద్ధ, నాగేంద్ర, సూర్యనారాయణ, చక్రధర్, ప్రసాద్, ప్రకాష్, సుల్తాన్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న శ్యామ్‌రాజ్ నాయక్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆధునిక వ్యవసాయ, సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సిహెచ్.శ్యామ్‌రాజ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని జె.తిమ్మాపురం, జి.రాగంపేట గ్రామాల్లో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అందిస్తున్న సేవలను ఆయన ఆదివారం పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా నాలుగు నెలల పాటు విద్యార్థులు రైతులకు సేవలందిస్తారన్నారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్ల అందజేత



కిట్లు అందిస్తున్న ఎస్‌సి,ఎస్‌టి సంక్షేమ సంఘం

ప్రజాశక్తి-అంబాజీపేట

గంగలకుర్రు హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు అంబాజీపేట ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం సభ్యులు పరీక్షలకు అవసరమయ్యే జామెంట్రీ బాక్స్ తదితర వస్తువులు అందజేశారు. పరీక్షలు బాగా రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తమ స్థాయిలో మార్కులు సాధించాలని విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోనసీమ ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం వి.సత్య నారాయణ, టి.రామ కుమారి, హాస్టల్ వార్డెన్ బివివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు రోజులు పల్స్ పోలియో

ప్రజాశక్తి-తాళ్లపూడి

మరో రెండు రోజులపాటు చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు మొబైల్ టీములు ఏర్పాటు చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా లక్షా 60 వేల పోలియో కేంద్రాల ద్వారా కోటీ 90 లక్షల 470 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు ఆదివారం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట ఆరోగ్య శాఖ సిబ్బంది కపావరం తదితరులు ఉన్నారు.

పాత్రికేయునికి సహచరుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సంజీవయ్య నగర్‌కు చెందిన పాత్రికేయుడు బాతు ఆనంద్‌కు అనారోగ్యంగా ఉండడంతో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పండు, టింకు, రాజా, జిఎస్‌బి భద్రరావు, సింహాచలం, శివరామకృష్ణ, రాజు, జయరాజు, ఆనంద్, గుబ్బరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

కాపు జెఎసి అధ్యక్షునిగా నామన

ప్రజాశక్తి-తాళ్లపూడి

కొవ్వూరు నియోజకవర్గ కాపు జెఎసి అధ్యక్షునిగా తాళ్లపూడికి చెందిన నామన సత్యనారాయణ నియమితులయ్యారు. కాపు జెఎసి చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు నుంచి తనకు నియామక పత్రాలు అందాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాపుల ఐక్యత, సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు.

నిరుపయోగంగా చేతిపంపు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



వినియోగంలో లేని చేతి పంపు

స్థానిక మండల పరిషత్ కార్యాలయ విద్యాశాఖ భవనం వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతుకు గురై ఏళ్లు గడుస్తున్నా అధికారులు నేటికీ పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో వేరువేరుగా మరుగుదొడ్లు నిర్మించి చేతిపంపు వద్ద ఉన్న మోటారును వాటర్ ట్యాంక్ వినియోగించి, కుళాయి సౌకర్యం కల్పించడంతో ఈ చేతి పంపును పట్టించుకోలేని నాధుడే కరువయ్యారు. విద్యాశాఖ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేటప్పుడు, సామూ హిక భోజనం కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు, తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడే సందర్భాలు ఏర్పడుతున్నాయి. మరుగుదొడ్డిలో ఉన్న కుళాయిలను వినియోగించడానికి ఇష్టపడని వారు ఈ చేతి పంపునే వినియోగించేవారు. ఈ చేతి పంపు కూడా నిరుపయోగంగా ఉండటంతో తాగడానికి నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చేపంపును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పలువురిని పరామర్శించిన దాట్ల



మల్లేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ దాట్ల

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మండలంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు గుత్తుల మల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక పంచాయతీకి చెందిన కేమిశెట్టి సత్య మాణిక్యాలరావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. చొల్లంగి పంచాయతీలో ఇటీవల మరణించిన స్వర్ణ భయ్యన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. జి.వేమవరంలో ఇటీవల మరణించిన అనుకూలి సత్యన్నారాయణ కుటుంబ సభ్యులు మహాలక్ష్మి రావును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట పలువురు మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే సూపర్ సిక్స్ పథకాలు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్రంలోని పేదల అభివృద్ధి కోసమే టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక 19వ వార్డు పరిధిలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లా డుతూ టిడిపిని గెలిపించడం ద్వారానే ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముకాభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, రంది సత్యనారాయణ, కొరిపురి రాజు, బొడ్డ ఉదయ్, చాగంటి గోపాలకృష్ణ, అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి - కడియం

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ బి.తులసీధర్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిని, వాహనాలు నడుపుతున్న మైనర్లను, అలాగే ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రుల మీద, మరియు వాహన యజమానుల మీద చట్టవరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ర్యాలీ

పెద్దాపురం: మహారాణి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-5 పిఒ ఎం.తాతాజీ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ కాలనీలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ జరిగింది. రాజీవ్ కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీలలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నా రు..

దస్తావేజు పోయినవి

కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, పెదపూడి గ్రామం, డో.నెం.1-171/1రు కాపురస్తులు పల్లపాటి కృష్ణమూర్తి గారి కుమారుడు **పల్లపాటి నానిబాబు** గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా ఆస్తికి సంబంధించి ది.**16-07-2020** సం॥రం తేదీన రామచంద్రపురం సబ్-రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రీ కాబడిన దస్తావేజు నెం.**2560/2020** గల ఒరిజినల్ లింకు దస్తావేజును ది.20-02-2024 సం॥రం తేదీన పెద్దాడలో గల మా ఇంటినుండి సర్పవరంలో గల మా బంధువుల ఇంటికి తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యంలో సదరు లింకు దస్తావేజు పడిపోయినది. కావున లింకు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

పల్లపాటి నానిబాబు
S/o. కృష్ణమూర్తి, డో.నెం.1-171/1
పెద్దాడ గ్రామం, పెదపూడి మండలం
కాకినాడ జిల్లా, సెల్: 9989845958